పాలకూర సీతాలత

# సీతాలతా – చిన్నకథ

## పెళ్ళిచూపులు

నాగేశ్వరరావుగారు తెగ హడావుడి పడిపోతున్నారు. అవును మరి. ఆడది ఎంతగా చదువుకున్నా, ఎంత పెద్ద ఉద్యోగం చేస్తున్నా ఆమె పెళ్ళి కన్నతండ్రికి ఒక సమస్యగా మారక తప్పదు. కట్నం ఇచ్చేందుకు, లాంఛనాలు ముట్టచెప్పేందుకు ఆర్థిక స్థోమత వున్నా కూడా సంబంధాల కోసం వెదకడం, ఆ వెతికిన సంబంధాల్లో ఒకటి కుదరటం — తలనొప్పి వ్యవహారమే.

ఆయనహడావుడికి కూడా కారణం అదే. కూతురు ఇందిరను చూసుకుందుకు వస్తున్నారు. వాళ్ళకు మర్యాదలు చెయ్యాలి. ఎలాంటి లోపం కన్పించనీయకుండా వాళ్ళు వున్నంత సేపూ సిట్యుయేషన్ మేనేజ్ చేసుకోవాలి.

కుర్రవాడి గురించి వివరాలు బాగానే వున్నాయి. పేరు సుధాకర్. మనిషి చక్కగా స్మార్ట్ గా వున్నాడు. బ్యాంకులో ఆఫీసరుగా ఉద్యోగం. సంపాదన బాగుంది.

ఇంటిముందు ఆటో ఆగింది. హడావుడిగా బయటకు వచ్చారు ఆయన.

ఆటోలోంచి ఇద్దరు యువకులు దిగేరు. అందులో ఒకరు సుధాకర్. అతని తల్లిదండ్రులు వచ్చినట్లు లేదు. ఆటో బిల్లు చెల్లించబోతుంటే సుధాకర్ వారించాడు.

''మీ అమ్మగారు, నాన్నగారు రాలేదా బాబూ?'' అడిగేరు నాగేశ్వరరావుగారు.

సుధాకర్ అడ్డంగా తలూపేడు.

''లేదండీ... నాన్నగారు ఏదో అర్జంటు పనిమీద క్యాంపుకెళ్ళారు. మా అక్కయ్యకు ఒంట్లో బాగోలేదని ఉత్తరం రాస్తే అమ్మ అక్కడకు వెళ్ళింది. మీకు డేట్ ఇచ్చాం కదా అనీ, మీకు నిరాశ కల్గించడం ఎందుకనీ నేనే బయలుదేరి వచ్చాను. నా స్నేహితునితో... బైదిబై... ఇతను నా ఆప్తమిత్రుడు.. పేరు గాంధీ..'' అన్నాడు సుధాకర్ .

గాంధీ చేతులు జోడించి నమస్కరించాడు నాగేశ్వరరావు గారికి.

''అలాగా... చాలా సంతోషం బాబూ.. రండి'' అంటూ ఆ మిత్రులిద్దర్నీ వెంటబెట్టుకుని లోపలకు తీసుకువెళ్ళి కూర్చోబెట్టారు.

''మీవాళ్ళు కూడా వచ్చివుంటే బాగుండేది'' అన్నారు నాగేశ్వరరావుగారు.

''వారి గురించి మీకు ఆలోచన అనవసరం. నా పెళ్ళి విషయంలో మా వాళ్ళు నాకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చా రు. 'నాకు ఫలానా అమ్మాయి నచ్చింది' అని నేను చెప్పడం ఆలస్యం. మావాళ్ళు ముహూర్తాలు పెట్టించడానికి సిద్ధం...'' అన్నాడు సుధాకర్.


''అలాంటి తల్లిదండ్రులున్న మా సుధాకర్ నిజంగా అదృష్టవంతుడు...'' అన్నాడు గాంధీ చిన్నగా నవ్వుతూ..

''అవును.. నిజమే..'' అన్నారు నాగేశ్వరరావుగారు గాంధీతో ఏకీభవిస్తూ.

సుధాకర్ గొంతు సవరించుకుని అన్నాడు.

''మీరు ఏం అనుకోనంటే త్వరగా అమ్మాయిని చూపించండి... గాంధీకి బదిలీ అయిపోయింది. ఈ రాత్రికే వెళ్ళిపోవాలి. కనుక మేం కొంచెం త్వరగా బయటపడాలి...''

''అలాగే బాబూ... దాందేముంది...'' అంటూ లోపలకు వెళ్ళారు ఆయన.



రెండు నిమిషాల్లో ఇందిరను తీసుకువచ్చి మరో కుర్చీలో కూర్చోబెట్టారు. అదే సమయంలో ఆ యువకులు ఇద్దరికీ టిఫిన్ సర్వచేశారు.

ఇందిరను పరీక్షగా చూశాడు సుధాకర్. అతని హృదయంలో కోటి వీణలు మ్రోగాయి. ఆమె చాలా అందంగా ఉంది. ఆమెలో లోపం వెతకాలంటే అది ఆ బ్రహ్మదేవుడి తరం కూడా కాబోదు.

''మీ పేరు...'' అడిగాడు సుధాకర్.

ఎక్కువగా సిగ్గుతో మెలికలు తిరిగిపోకుండా వెంటనే చెప్పింది.

''ఇందిర...''

ఆ తర్వాత ప్రశ్నల వర్షం కురిపించాడతను.

''ఎంతవరకూ చదువుకున్నారు?''

''మీకు సంగీతం వచ్చా?''

''మీ హాబీలు ఏమిటి?''

''వంట చెయ్యడం చేతనవునా?''

''ఆడది ఉద్యోగం చెయ్యటం గురించి మీ అభిప్రాయం ఏమిటి?''

ఈ రకంగా...

తగు రీతిగా జవాబు చెప్పి అతన్ని ఆకర్షించింది ఆమె.

''నాన్పుడు బేరం నాకు పడదు. మీ అమ్మాయి నచ్చింది. ఆమెను పెళ్ళిచేసుకుంటాను. ఆమె అభిప్రాయం ఏమిటో కనుక్కోండి...'' అన్నాడు సుధాకర్.

నాగేశ్వరరావుగారి ముఖం ప్రసన్నమైంది. ఇందిరను లోపలకు తీసుకువెళ్ళారు. రెండు నిమిషాల తర్వాత వచ్చి...

"అమ్మాయి కూడా ఒప్పుకుంది బాబూ.." అన్నారు.

గర్వంగా గాంధీవంక చూశాడు సుధాకర్. మిత్రుడి భుజం తట్టాడు గాంధీ.

"మరి కట్న కానుకలు..." అంటూ సగంలో ఆగిపోయారు నాగేశ్వరరావుగారు.

సుధాకర్ ముఖం చిట్లించాడు.

"క్షమించండి... అలాంటి మాటలు



మాట్లాడి నా సంస్కారాన్ని అవమానం చెయ్యకండి. కట్నం లేకుండా పెళ్ళి చేసుకోవాలన్నది నా ఆదర్శం. అందుకు నా తల్లిదండ్రుల సపోర్టు కూడా ఉంది..." అన్నాడు.

"బాబూ.. ఎంత అదృష్టవంతుడ్ని" అన్నారు నాగేశ్వరరావుగారు సుధాకర్ చేతులు పట్టుకుని.

చిన్నగా నవ్వేడు సుధాకర్.

ఆ తర్వాత మిత్రులు ఇద్దరూ శలవు తీసుకున్నారు.

* * *

ఆ మర్నాడు సాయంత్రం సుధాకర్ నాగేశ్వరరావుగారి ఇంటికి వచ్చాడు.

"నీ ఫ్రెండు... అదే... ఆ గాంధీ.. వెళ్ళిపోయాడా?" అడిగారు ఆయన.

"ఆ.. నిన్న రాత్రి రైల్లో వెళ్ళిపోయాడు మామయ్యా..." అన్నాడు సుధాకర్.

"నీకూ ఇందిరకూ పెళ్ళి ముహూర్తం వచ్చే నెల ఖరవైన... ఈరోజే పెట్టించా ముహూర్తం. నీ పెళ్ళి చూపుల సరదా తీరింది కదా" అన్నాడు నాగేశ్వరరావుగారు.

"ఆహా నీ దయవల్ల.. మానాన్న కంటే నువ్వు చాలా మంచివాడివి. నా సరదా తీర్చడమే కాక నా స్నేహితుని ముందు నా గౌరవం నిలిపావు..." అన్నాడు సుధాకర్.


"నా కూతురు పెళ్ళి చెయ్యడానికి నీ సరదా తీర్చడం మినహా మరో దారి లేదుకదా ..." అనుకున్నారు ఆయన.

నాగేశ్వరరావుగారు సుధాకర్‌కి మేనమామ. సుధాకర్‌కి ఇందిరను ఇచ్చి చెయ్యాలని ఎప్పుడో నిర్ణయం అయ్యింది. ఆమెను చేసుకోనని ఈ మధ్య మొండికేశాడు సుధాకర్. కారణం అడిగితే నసుగుతూ బైటపెట్టాడు. 'జీవితంలో స్నేహితులతో వెళ్ళి పెళ్ళిచూపులు చూడటం అనే ఒక మధురమైన అనుభూతి తనకు దక్కకుండా పోతుంది కనుక ఇందిరను చేసుకోనన్నాడు. ఆ మాట విని అతని తండ్రి అగ్గిరాముడై ఇందిరను చేసుకుతీరాలని చెప్పడంతో ముఖం వేల్లాడేసుకుని సందిగ్ధంలో పడిపోయాడు. పరిస్థితి ఇలావుండగా నాగేశ్వరరావుగారు కల్పించుకుని (కాబోయే) అల్లుడి ముచ్చట తీరుస్తానని మాట ఇచ్చి ఇందిరనే పెళ్ళిచూపుల్లో చూసుకునే ఏర్పాటుచేశారు. పెళ్ళిచూపుల అనుభవం దక్కినందుకు సుధాకర్ తృప్తిపడ్డాడు.

తమ కోరుకున్నవాడే అల్లుడు అవుతున్నందుకు నాగేశ్వరరావు గారు సంతోషించారు.

ఇందిర కూడా లోలోన సంతోషించింది ఈ అనుభవం తనకూ దక్కినందుకు.


*


ఒక సిపిసి పంపు సెట్టును
కొనుక్కొని వుండవచ్చునే అని
మీరు యోచించవలసిన
సందర్భం యిది.

మీకు సిపిసి ప్రీమియర్ డొమెస్టిక్ పంపు సెట్టుపై 2 సంవత్సరాల గ్యారంటీ కలదు. కారణం, యీ రంగంలో 40 సంవత్సరాల అద్వితీయమైన అనుభవమును అండగా కలిగివున్న బలిష్ఠమైన సిపిసి ప్రీమియర్ మోటారు అమర్చబడిన ఒకే ఒక పంపు సెట్టు యిది.

2 సంవత్సరాల గ్యారంటీ



పైగా, దీని అనన్యమైన అమ్మక స్థావరములు విస్తారముగా వ్యాపించి, మీకు అందుబాటులో వున్నందువల్ల, అమ్మకం తర్వాత విశ్వసనీయమైన సర్వీసును వెను వెంటనే సమకూర్చగలదు.

**సిపిసి ప్రీమియర్**

గృహోపయోగ పంపు సెట్లు

**సిపిసి (పి) లిట్**

శాఖలు :- 17-2-30 పొన్నియమ్మన్ కోయిల్ స్ట్రీట్, చిత్తూరు-1 ఫోను : 3228 ● 5-2-130-131, రాష్ట్రపతి రోడ్డు, సికిందరాబాదు- 500 003, ఫోను : 824094 ● 66/67, సిల్వర్ జూబిలీ పార్క్ రోడ్డు, బెంగళూరు- 560 002.

9861 TG/AB